క్లుప్తంగా

'అర్హులు ఓటుహక్కు వినియోగించుకోవాలి'

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న పోలింగ్‌లో భారత ఎన్నికల సంఘం జారీ చేసిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఒక దానితో ఓటుహక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, ఈజీఎస్ జాబ్ కార్డు, ఫొటోతో కూడిన బ్యాంకు, పోస్టాఫీసు పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వశాఖ నుంచి జారీ అయిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌ఎస్, ప్రభుత్వ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటోతో కూడిన సర్వీస్ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కారు యూనిక్ డిసెబిలిటీ కార్డుల్లో ఏదైనా ఒక కార్డు వినియోగించి ఓటు వేయవచ్చని తెలిపారు.

లింగ వివక్ష చూపొద్దు

ఎదులాపురం: తల్లిదండ్రులు పిల్లల విషయంలో లింగ వివక్షత చూపించొద్దని సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతి అన్నారు. స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 అంతర్జాతీయ ప్రచారోద్యమం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని బొక్కలగూడలోని మగ్గం వర్క్ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు, బంగారిగూడ మైనార్టీ హాస్టల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ లింగ వివక్షతను నిర్మూలనకు కృషి చేయాలన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహ చట్టం, గృహహింస చట్టం, సైబర్‌నేరాల గురించి వివరించారు. సఖీ కేంద్రం సిబ్బంది కేసే వర్కర్ నాగమణి, పారామెడికల్ వర్కర్ సుకేష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లోనే పోలింగ్‌బూత్‌లు..

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలతో ఓటర్లు, సిబ్బందికి ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. పోలింగ్ బూత్ నెం.102లో 1047 ఓటర్లు, బూత్ నెం.103లో 1034 ఓటర్లు, బూత్ నెం.104లో 889 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడమే కాకుండా ఇరుకైన గదులు ఉన్నాయి. ఓటర్ల క్యూకు కనీసం స్థలం కూడా లేదు. ఒకేసారి వంద మంది ఓటర్లు వస్తే కిక్కిరిసి పోతుంది. వచ్చి వెళ్లేందుకు చిన్న దారి మాత్రమే ఉంది. దీంతో ఇక్కట్లు తప్పేలా లేవు. విశాలమైన ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నప్పటికీ అధికారులు గుర్తించక పోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేలకొరిగిన వరిపంట

కుంటాల: తుఫాన్ ప్రభావంతో మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం తెల్లవారు జామున వర్షం కురిసింది. దీంతో వరి పంటలు నెలకొరిగాయి. కల్లాల వద్ద ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

నిస్వార్థంగా ఓటు వేయాలి

కెరమెరి: ఐదేళ్లకోసారి నిర్వహించే సార్వత్రిక ఎన్నికలు మరికొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటు అసలైన ఆయుధం. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు హక్కు వినియోగంపై పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఓటరు జాబితాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. ఓటు సమాజానికి ఉపయోగపడే వ్యక్తిని నియమిస్తుంది. ఓటుకు ఉన్న విలువ వేరే దేనికి ఉండదు.

- గిత్తే తిరుపతి, కెరమెరి

డబ్బుకు లొంగవద్దు



ఓట్లు అనగానే చాలా మంది డబ్బుకు ఆశ పడుతారు. డబ్బులు, మద్యం ఇచ్చిన వారికే ఓటు వేస్తారు. అది ప్రజాస్వామ్యంలో నేరంగా పరిగణిస్తారు. ఎలాంటి తాయిలాలకు లొంగకుండా ఓటు వేయాలి.

- పాతాడే రాజు, కెరమెరి

భవిష్యత్తు మన చేతుల్లోనే..



మన భవిష్యత్తు మన చేతిలోనే ఉంది. అన్నింటికంటే పదునైనా ఆయుధం ఓటు. నాయకుడు ఎలాంటి వాడో చూసుకొని ఓటు వేయాలి.

- ఎస్.అంబదాస్, దేవాపూర్

కౌటాల: తమ సమస్యలు పరిష్కరించే వారికే ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లు పేర్కొంటున్నారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

కనీస వేతనాలివ్వాలి



స్కూల్ బస్‌డ్రైవర్లకు కనీస వేతనాలు అందజేయాలి. పలు ప్రైవేట్ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్యాలు పనికి తగిన వేతనం అందించడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

- మహేశ్, స్కూల్ బస్‌డ్రైవర్

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



కొత్తగా ఏర్పడే రాష్ట్ర ప్రభుత్వం బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి. అర్హతలు కలిగిన డ్రైవర్లకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలి. డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి. డ్రైవర్లకు హెల్త్ కార్డులు అందించాలి.

- హెచ్.రాజు, స్కూల్ బస్‌డ్రైవర్

బీమా సౌకర్యం కల్పించాలి



ప్రైవేట్ పాఠశాలల్లో బస్ డ్రైవర్‌గా పని చేస్తున్న డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం గుర్తించాలి. స్కూల్ బస్ డ్రైవర్లకు రూ. 5 లక్షల యాక్సిడెంటల్ బీమా, సాధారణ మరణాలు, అంగవైల్యానికి వర్తింప చేయాలి.

- నారాయణ, స్కూల్ బస్‌డ్రైవర్

పథకాలు వర్తింపజేయాలి



ప్రైవేట్ స్కూల్ బస్‌డ్రైవర్లకు యాజమాన్యాలు చాలీచాలని వేతనాలు అందిస్తున్నాయి. బస్ డ్రైవర్ల పిల్లలకు అదే పాఠశాలలో ఉచితంగా విద్య అందించడంతో పాటు స్కూల్ డ్రెస్, పుస్తకాలు, నోట్స్ అందించాలి.

- రమేశ్, స్కూల్ బస్‌డ్రైవర్

నిత్యాన్నదానం ప్రారంభం



నిత్యాన్నదానంలో పాల్గొన్న అయ్యప్పస్వామి భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి దీక్షలు పురస్కరించుకొని ఏటా నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిత్యాన్నదాన కార్యక్రమం జనవరి 14 వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటికే పలువురు దాతలు నిత్యాన్నదానానికి ముందుకొచ్చారని, ఆసక్తి గల భక్తులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి చంద్రమోహన్, బొట్టుపెల్లి సంతోశ్, సతీశ్, సంతోశ్, బాలరాము, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, మహేశ్, శ్యాం సుందర్, స్వాములు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పన
- ఎన్నికల సామగ్రితో చేరుకున్న సిబ్బంది



చింతలమానెపల్లిలోని పోలింగ్ కేంద్రం

రెబ్బెన: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 28,512 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 14,549, మహిళలు 13,963 ఉన్నారు. వీరంతా నేడు జరగబోయే ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు మండలంలో 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని 5 రూట్లలో ఐదుగురు సెక్టర్ అధికారులు, ఐదుగురు రూట్ అధికారులతో పాటు 37 మంది ప్రిసైడింగ్ అధికారులు, 37 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 74 మంది ఇతర పోలింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టెంట్లు, దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్లు సిద్ధంగా ఉంచారు. ఈనేపథ్యంలో గోలేటిటౌన్‌షిప్‌లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సురేశ్‌కుమార్ సందర్శించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు.

దహెగాం: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మండలంలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో 25,992 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 13,050, స్త్రీలు 12,942 ఉన్నారు. వీరికి 37 పోలింగ్ కేంద్రాలు, ఐదు రూట్లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కవిత పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

కెరమెరి: నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 29 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.



కెరమెరిలోని పోలింగ్ కేంద్రం



కౌటాలలోని పోలింగ్ కేంద్రం

మొత్తం 23,196 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 11,780, మహిళలు 11,415, థర్డ జెండర్ ఒక్కరు ఉన్నారు. వీరంతా నేడు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, ముగ్గురు ఓపీవోలు, బీఎల్‌వో, ఆశా కార్యకర్తను నియమించినట్లు తహసీల్దార్ ప్రమోద్ తెలిపారు. ఆయా కేంద్రాలకు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించినట్లు ఎంపీడీవో, సెక్టార్ అధికారి మహేందర్ తెలిపారు.

కౌటాల: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండలంలోని 34 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. నేడు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మండలంలోని 26,815 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కెరమెరి: ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

చింతలమానెపల్లి: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. నేడు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మండలంలోని 23,161 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మండల కేంద్రంలోని ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ముస్తాబు చేశారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పూర్తి

- సిర్పూర్ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి



సిబ్బందికి విధులు కేటాయిస్తున్న ఎన్నికల అధికారి

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా నేడు జరుగనున్న పోలింగ్ కోసం ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేసినట్లు సిర్పూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి దీపక్ తివారి అన్నారు. బుధవారం సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిటీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు జారీ చేయడంతో పాటు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 294 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సిబ్బంది, ఎన్నికల సామగ్రి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 39 మంది సెక్టోరల్ అధికారులు 39 రూట్ల వారీగా పోలింగ్ సిబ్బందిని, తమకు కేటాయించిన రూట్‌లో పోలీస్ బందోబస్తు మధ్య తరలించినట్లు తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఒక పీవో, ఒక ఏపీవో, ఇద్దరు ఓపీవోలతో పాటు ఒక పోలీస్ కానిస్టేబుల్ విధులు నిర్వహించనున్నారు. 12 మంది వీడియోగ్రాఫర్లు, వెబ్ కాస్టింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండనున్నారు. 20 ఆర్టీసీ బస్సులు, 35 ప్రైవేట్ బస్సులు, 10 జీపులు, 35 టాటా ఏస్ వాహనాలను వినియోగించనున్నారు. 52 మంది మైక్రో అబ్జర్వర్లు సేవలు అందించనున్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిర్పూర్ ఎన్నికల అధికారి దీపక్ తివారి ప్రజలకు, అధికార, సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు

కాగజ్‌నగర్‌టౌన్: పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్ రావు అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌తో కలిసి పట్టణంలోని సెయింట్ క్లారెట్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీసులకు విధులు కేటాయించారు. 294 పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ బందోబస్తుతో పాటు ప్రత్యేక పెట్రో, ఇతర సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, 1200 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్ సందర్శించి, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ పరిధిలోని పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

అయ్యప్ప మహా పడిపూజ

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో బుధవారం నారికేళ గురుస్వామి గురిజాల నర్సయ్య ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. గణపతి, గౌరీపూజ చేశారు. గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప చిత్రపటాలను అలంకరించి పంచామృతాలతో అభిషేకించారు. గురుస్వామి మంత్రి సాయినాథ్, జక్కని గజేందర్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టారు.

కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో షాపింగ్‌మాళ్లలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు వేతనంలో కూడిన సెలవును గురువారం ప్రకటించాలని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, ప్రధాన కార్యదర్శి రాజు యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఎన్నికల సందడి

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అధికారులు అంతా సిద్ధం చేశారు. నేడు ఉదయం నుంచి పోలింగ్ స్టేషన్లలో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించనున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఉన్నతాధికారులు బుధవారం పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేశారు. సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిటీ పాఠశాల ఆవరణలో, ఆసిఫాబాద్ నియోజవవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల వసతిగృహం ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. -సాక్షి నెట్‌వర్క్



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది



ఆసిఫాబాద్: పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి దాసరి వేణు



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది



కాగజ్‌నగర్‌టౌన్: ప్రక్రియను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు



కాగజ్‌నగర్‌టౌన్: సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



రెబ్బెనలో సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది



కాగజ్‌నగర్‌టౌన్: సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు



కెరమెరి పోలింగ్ కేంద్రానికి చేరుతున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్ కోసమే కట్టారు..!



మానిక్‌పటార్ పోలింగ్ కేంద్రం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామ పంచాయతీ పరిధిలోని మానిక్‌పటార్ గ్రామంలో నూతన పోలింగ్ కేంద్రం నిర్మించారు. గతంలో మానిక్‌పటార్ ఓటర్లు సమీపంలోని మాలిని గ్రామానికి వెళ్లి ఓటు వేసేవారు. రవాణా సౌకర్యం లేక ఎన్నికలు వచ్చిన ప్రతిసారి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల కోసం మానిక్‌పటార్ గ్రామంలోని పాఠశాల వద్ద పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం పరిధిలో 41 మంది మహిళలు, 38 మంది పురుషులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో ముమ్మర తనిఖీలు

ఖానాపూర్: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో బుధవారం అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఎస్‌టీ బృందం ఆధ్వర్యంలో రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్నంగా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామి, తదితరులున్నారు.